క్లుప్తంగా

పోస్టులకు కౌన్సెలింగ్



కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న డీఈఓ

నగరి: నగరి డివిజన్ పరిధిలో ఖాళీగా ఉన్న ఐదు టీచర్ల పోస్టుల భర్తీకి జిల్లా విద్యాశాఖ అధికారి దేవరాజు గురువారం కౌన్సెలింగ్ నిర్వహించారు. స్థానిక ఎస్‌జీఎస్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో డివిజన్ పరిధిలోని పాఠశాలల మిగులు టీచర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. బయాలజికల్ సైన్స్ ఒకటి, ఇంగ్లిష్‌లో నాలుగు వేకెన్సీలకుగాను కౌన్సెలింగ్ నిర్వహించి ఖాళీలను భర్తీ చేశారు. ఎంఈఓ శ్రీదేవి పాల్గొన్నారు.

విద్యతోపాటు క్రీడలూ అవసరం



మాట్లాడుతున్న ప్రిన్సిపల్

కార్వేటినగరం: విద్యార్థులకు విద్యతో పాటు క్రీడలు ఎంతో అవసరమని ఎస్ఐ రాజ్‌కుమార్ అన్నారు. గురువారం జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన సమావేశానికి విచ్చేసిన ఎస్ఐ రాజ్‌కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు విద్యతో పాటు క్రీడలపై ఆసక్తిని పెంపొందించుకోవాలని సూచించారు. ఉద్యోగ, ఉపాధిలో క్రీడా ఆవశ్యకత ఎంతో అవసరం ఉందని గుర్తు చేశారు. ప్రిన్సిపల్ డాక్టర్ విజయులురెడ్డి, అధ్యాపకులు బాలసుబ్రమణ్యం, ధనుంజయ రెడ్డి, లత, సుబ్బారావు, హరిబాబు, భార్గవి, మీనా, రాజశేఖర్, విశ్వనాథరెడ్డి పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం తనిఖీ



మధ్యాహ్న భోజనం తనిఖీ చేస్తున్న డీఈఓ

నగరి: పట్టణ పరిధిలోని ఎస్‌జీఎస్ బాలికల ఉన్నత పాఠశాలలో నిర్వహించిన క్రీడాదినోత్సవం, తెలుగుభాషా దినోత్సవంలో పాల్గొన్న డీఈఓ దేవరాజు పాల్గొన్నారు. విద్యార్థులకు మాతృభాషా ఔన్నత్యాన్ని వివరించారు. క్రీడల్లో విద్యార్థులు రాణించాలని సూచించారు. అనంతరం విద్యార్థులతో కలసి మధ్యాహ్న భోజనం తనిఖీ చేశారు. ప్రతిరోజూ అందించే భోజనం గురించి విద్యార్థులను ఆరాతీశారు. ఇలాగా విద్యార్థులకు భోజనం వడ్డించాలని నిర్వాహకులకు సూచించారు. నగరి, పాలసముద్రం ఎంఈఓలు శ్రీదేవి, రాజేంద్రప్రసాద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న వైద్యులు

శ్రీరంగరాజపురం: మండలంలోని ఆరిమాకులపల్లి ప్రభుత్వ ఉన్న పాఠశాలలో వైద్యాధికారి డాక్టర్ బాలసుబ్రమణ్యంరెడ్డి, డాక్టర్ గౌరి ఆధ్వర్యంలో గురువారం బాల్య వివాహాల నిర్మూలనపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ బాల్య వివాహాల నిరోధక చట్టం 2006 ప్రకారం అమ్మాయి వయస్సు 18 ఏళ్లు, అబ్బాయి వయస్సు 21 ఏళ్లు విధిగా ఉండాలని, నిర్దేశిత వయస్సులోపు పెళ్లి చేస్తే చట్టరీత్యానేరమని అన్నారు. బాల్యవివాహాన్ని ఎవరైనా ప్రోత్సహించినా, పెళ్లి చేసినా వారికి రూ.లక్ష జరిమానా, మూడేళ్ల జైలు శిక్ష ఉంటుందని విద్యార్థులకు వివరించారు. మీ పరిసర ప్రాంతాల్లో బాల్య వివాహాలు జరుగుతుంటే వెంటనే స్థానిక పోలీసు స్టేషన్‌కు, 1098 టోల్ ఫ్రీనంబర్‌కు తెలపాలన్నారు.

రెండు ఇసుక ట్రాక్టర్ల సీజ్



ట్రాక్టర్లను సీజ్ చేసిన ఎస్ఐ

కార్వేటినగరం: అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను సీజ్ చేసినట్లు ఎస్ఐ రాజ్‌కుమార్ తెలిపారు. గురువారం తమ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్ఐ మాట్లాడారు. ఆర్కేవీబీ పేట గ్రామ సమీపంలోని చింపిరి కాలువ నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్నట్లు రహస్య సమాచారం అందింది. ఈమేరకు సిబ్బందితో కలసి దాడులు నిర్వహించి అదే గ్రామానికి చెందిన రెండు ట్రాక్టర్లను ఇసుకతో పాటు స్టేషన్‌కు తరలించి సీజ్ చేశామన్నారు. ఏఎస్ఐ మునికృష్ణ పాల్గొన్నారు.

కఠినంగా శిక్షించాలి



కోల్‌కతా ట్రైనీ డాక్టర్ ఉదంతం మమ్మల్ని ఎంతగానో కలచివేసింది. రాత్రి పూట డ్యూటీలంటేనే ఆందోళన చెందాల్సివస్తోంది. పీహెచ్‌సీలో అన్ని సదుపాయాలు ఉండడంతో రాత్రి పూట రోగులు వస్తుంటారు. మహిళా సిబ్బంది రోగులకు అందుబాటు ఉంటూ వైద్య అందిస్తున్నారు. మహిళలు, డాక్టర్లపై దాడులు చేస్తే వారిని కఠినంగా శిక్షించాలి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వైద్య సిబ్బందికి కల్పించాలి **-సోమశేఖర్, డాక్టర్, విజయపురం.**



రక్షణ కల్పించాలి



అన్ని రంగాల్లో పనిచేస్తున్న మహిళలకు రక్షణ కల్పించాలి. మహిళా డాక్టర్లకే కాకుండా ఎక్కడ మహిళలు పనిచేస్తున్నా వారికి భద్రత ఉంటే ధైర్యంగా వారి పనులు చేసుకుంటారు. మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలంటూ నినాదాలు ఉన్నా, ఆచరణలో సాధ్యం కావడం లేదు. ప్రభుత్వ వైద్యశాలలో పనిచేస్తున్న మహిళలకు సరైన వసతులతో పాటు రక్షణ కల్పించాలి

డాక్టర్.హేమశ్రీ, వైద్యాధికారిణి, కత్తెరపల్లి పీహెచ్‌సీ, కార్వేటినగరం

చట్టాలు పక్కాగా అమలు చేయాలి



సెంట్రల్ ప్రొటెక్షన్ యాక్ట్ అమలు చేస్తే వైద్య రంగంలో మహిళా ఉద్యోగులకు మరింత భద్రత ఉంటుంది.ఈ చట్టం అమలుతో డ్యూటీలో ఉన్న వైద్య సిబ్బందిపై దాడులు జరిగితే ఫిర్యాదులు అందిన అరగంట వ్యవధిలో నిందితులపై చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. ఈ చట్టంపై విస్తృత ప్రచారం కల్పించాలి. దీంతో వైద్య రంగంలో మహిళలకు రక్షణ కలుగుతుంది.

భువనేశ్వరి, వైద్యాధికారిణి, కత్తెరపల్లి పీహెచ్‌సీ, కార్వేటినగరం

దేశ భాషలందు తెలుగు లెస్స

నగరి, జీడీనెల్లూరు నియోజకవర్గంలోని ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలు, విద్యాసంస్థల్లో గురువారం గిడుగు వెంకట రామమూర్తి జయంతిని పురస్కరించుకుని తెలుగుభాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. గిడుగు చిత్రపటానికి నివాళులర్పించారు. పాఠశాలల్లో విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. వివిధ వేషధారణలో విద్యార్థులు అలరించారు.

- ఘనంగా తెలుగుభాషా దినోత్సవం
- వివిధ వేషధారణల్లో అలరించిన విద్యార్థులు
- భాష గొప్పదనాన్ని వివరిస్తూ ర్యాలీలు



నగరి: పీసీఎన్ పాఠశాల విద్యార్థుల వేషధారణలు



కార్వేటినగరం: ఆకట్టుకునేలా విద్యార్థుల ప్రదర్శన

నగరి : పీసీఎన్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గిడుగు రామమూర్తి చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. తెలుగుభాషకు ఆయన అందించిన సేవలను పలువురు ప్రముఖులు శ్లాఘించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులు తెలుగుతల్లి, గిడుగు, అష్టదిగ్గజాల వేషధారణలతో ఏకపాత్రాభినయం చేయడంతో పాటు తెలుగు ప్రాచీన ప్రస్తుత కవుల చిత్రపటాలతో మాతెలుగుతల్లికి మల్లెపూదండ అని పాడుతూ ర్యాలీ నిర్వహించారు. హెచ్‌ఎం శ్యామలాదేవి పాల్గొన్నారు. ముడిపల్లి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల వేషధారణలు అలరించాయి. హెచ్‌ఎం కే.జయశ్రీ, తెలుగు పండితులు డి.చంద్రశేఖర్ పాల్గొన్నారు. అదేవిధంగా గిడుగు రామమూర్తి జయంతిని పురస్కరించుకొని నగరి డిగ్రీ కళాశాలలో తెలుగుభాషా దినోత్సవాన్ని ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ఆర్.వేణుగోపాల్ నిర్వహించారు.



పుత్తూరు: మాట్లాడుతున్న డీవైఈఓ ప్రభాకర్‌రాజు



నిండ్ర: బహుమతులు ఇస్తున్న ఎంఈఓ

విజయపురం: శ్రీహరిపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తెలుగు భాషా దినోత్సవం, జాతీయ క్రీడా దినోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. ఎంఈఓ హరిప్రసాద్ వర్మ మాట్లాడుతూ దేశ భాషలందు తెలుగు లెస్స అని పేర్కొన్నారు. అనంతరం గిడుగు వెంకట రామమూర్తి, మేజర్ ధ్యానచంద్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. హెచ్‌ఎం జ్ఞానప్రసాద్ ఉపాధ్యాయులు విజయచంద్రిక, సునీత, రాధాకుమారి, వెంకటేశు, గోపి, విజయ్‌కుమార్, విజయ వర్మ, వెంకమరాజు, లక్ష్మీపతి పాల్గొన్నారు

కార్వేటినగరంలో..

కార్వేటినగరం: డీఎంపురం పాఠశాల ఆవరణలో జాతీయ తెలుగు భాషా దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. జరిగింది. ఇందులోభాగంగా తెలుగుదనం ఉట్టిపడేలా విద్యార్థులు ప్రదర్శించిన భువన విజయం, పరమానందయ్య శిష్యుల కథ, దుర్యోధన ఏకపాత్రాభినయం నాటికలు చూపరులను ఎంతో ఆకట్టుకుంది. తెలుగు అక్షర కిరీటధారణతో విద్యార్థినులు చేసిన ప్రదర్శన ఆలరించింది. హెచ్‌ఎం కేశవులు, పాఠశాల కమిటీ చైర్మన్ త్యాగరాజు, వైస్ చైర్మన్ సంధ్యారాణి, టీచర్లు సుబ్రమణ్యరెడ్డి, వెంకటరమణయ్య, ఢిల్లీబాబు, రాములు, వ్యాయామ ఉపాధ్యాయుడు తిరుమల రాజు, రంజిత్‌కుమార్, హరిత, సరస్వతి, మాలతి, సుమతి పాల్గొన్నారు.

నిండ్రలో..

నిండ్ర: స్థానిక జిల్లా ఉన్నత పాఠశాలలో విశిష్ట రచయిత పాఠ్యపుస్తక రూపకర్త పురుషోత్తమాచారిని ఘనంగా సన్మానించారు. అనంతరం వివిధ క్రీడల్లో రాణించిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఎంఈఓ శ్రీధర్‌రాజు పాల్గొన్నారు.

గంగాధరనెల్లూరులో..

గంగాధర నెల్లూరు: సర్వేరెడ్డిపల్లెలోని గురుకుల పాఠశాలలో గిడుగు వెంకటరామమూర్తి జయంతి సందర్భంగా ఆయన మాతృభాషకు చేసిన సేవలను కొనియాడారు. తెలుగు అవధానం పాఠశాల విద్యార్థులకు తెలుగు ప్రాముఖ్యతను వివరించారు. ప్రిన్సిపల్ ధమయంతి పాల్గొన్నారు.

పెనుమూరులో..

పెనుమూరు(కార్వేటినగరం): గిడుగు రామమూర్తి జయంతిని పురస్కరించుకుని జాతీయ తెలుగు భాషా దినోత్సవాన్ని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఘనంగా జరుపుకున్నారు. ప్రిన్సిపల్ బాల సుబ్రమణ్యంరాజు, ఎన్ఎస్ఎస్ పీఓ ఎం ప్రసాద్, ఈ.ఉమాపతి, మురుగన్ పాల్గొన్నారు.

పాలసముద్రంలో..

పాలసముద్రం: స్థానిక ఉన్నత పాఠశాలల్లో గురువారం హెచ్‌ఎం మీనాక్షి సమీక్షంలో తెలుగు భాషా, జాతీయ క్రీడా దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. అనంతరం గిడుగు వెంకట రామమూర్తి, ధ్యాన్‌చంద్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

పుత్తూరులో...

పుత్తూరు: తెలుగు భాష పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషిచేయాలని పుత్తూరు డీవైఈఓ హెచ్.ప్రభాకర్‌రాజు పిలుపునిచ్చారు. గురువారం గొల్లపల్లి ఉన్నత పాఠశాలలో తెలుగు భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అనంతరం అంతర్జాతీయ క్రీడా దినోత్సవ కార్యక్రమాన్ని ప్రారంభించారు. వివిధ వేషధారణలతో ప్రదర్శనలు ఇచ్చిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. నాగలాపురం ఎంఈఓ బాబయ్య, హెచ్‌ఎం భారతి, విద్యా కమిటీ చైర్మన్ శ్రీనివాసులు, ఉపాధ్యాయులు నరసింహులు, ప్రభావతి, సుబ్రమణ్యంనాయుడు, పీడీ గోపికృష్ణ పాల్గొన్నారు. అదేవిధంగా ఎస్వీపురం హైస్కూల్‌లో విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. అలాగే విద్యార్థులు ప్రదర్శించిన అష్టావధానం, భువన విజయం నాటకాలు అలరించాయి. విద్యార్థులకు బహుమతులు అందజేశారు. హెచ్‌ఎం డి.ప్రకాశం, ఉపాధ్యాయులు రంగయ్య, నరసింహారెడ్డి, సుదర్శనం, సూర్యప్రకాష్ పాల్గొన్నారు.



ముడిపల్లిలో..



శ్రీహరిపురం ఉన్నత పాఠశాలలో ..



పెనుమూరులో...



పాలసముద్రంలో..



ఎస్వీపురంలో అష్టావధానం ప్రదర్శిస్తున్న విద్యార్థులు



కార్వేటినగరం: తెలుగు అక్షర కిరీటధారణతో విద్యార్థుల ప్రదర్శన



సర్వేరెడ్డిపల్లె గురుకుల పాఠశాలలో..

రైతులను ఆదుకుంటాం

సాక్షి ఎఫెక్ట్..

శ్రీరంగరాజపురం: సాక్షి దినపత్రికలో గురువారం ప్రచురితమైన 'సమస్యల సుడిలో వ్యవసాయం 'అనే కథనంపై జిల్లా,మండల స్థాయి అధికారులు స్పందించారు. ఈ సందర్భంగా మండలంలోని పెద్దతయ్యూరు గ్రామంలో పి.జయరామయ్య అనే రైతు వేరుశనగ పంట, వరి పంటను మండల వ్యవసాయధికారి నర్మద పరిశీలించారు. రైతు 1.5 ఎకరంలో వరి పంట వేశారు. ఈ పంటలో నాశిరకం నకిలీ వరి విత్తనాలు వాడడం ద్వారా వరి 20 శాతం పండితే ఇతర కలుపు మొక్కలు 80 శాతం పెరిగాయన్నారు. అలాగే వేరుశనగ పంటను పరిశీలించి ఈక్రాప్ నమోదు చేశారు. నాశిరకం నకిలీ విత్తనాలు అమ్మకాలు జరిపిన షాపు యజమానిపై చట్టపరమైన చర్యలు తీసుకొని రైతుకు నష్ట పరిహారం అందిస్తామన్నారు. అనంతరం రైతులతో మాట్లాడుతూ ఎండకు వాడిపోతున్న వేరుశనగ పంటకు లీటర్ నీటితో 2 గ్రాముల యురియాను కలిపి వేరుశనగ పంటపై పిచికారీ చేయలన్నారు. ఈ విధంగా చేయడం ఎండ నుంచి వేరుశనగ పంటను 10 రోజుల వరకు కాపాడుకోవచ్చున్నారు. అలాగే వివిధ రకాల వరి, వేరుశనగ, జొన్న, చెరుకు, కందులు, ఆముదం, సజ్జలు వంటి పంటలపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమానికి సచివాలయం అగ్రికల్చర్ అసిస్టెంట్ శివ,సర్పంచ్ వరదమ్మ పాల్గొన్నారు.



పంటను పరిశీలిస్తున్న నర్మద

గెస్ట్ లెక్చరర్ పోస్టులకు దరఖాస్తులు

కార్వేటినగరం: గెస్ట్ లెక్చరర్ పోస్టులకు దరఖాస్తులు చేసుకోవాలని ఆర్కే ఎస్సార్ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ పి.స్వర్ణలత అన్నారు. గురువారం కళాశాలలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ప్రిన్సిపల్ మాట్లాడుతూ కళాశాలలో ఖాళీగా ఉన్న భౌతిక శాస్త్రం బోధించడానికి ఒప్పందపు అధ్యాపకుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పేర్కొన్నారు. దరఖాస్తు చేసుకునే అభ్యర్థి ఎంఎస్సీ పూర్తి చేసి 50 శాతం మార్కులు కలిగి ఉండాలని, ఈనెల 31వ తేదీలోపు దరఖాస్తులు చేసుకోవాలని చెప్పారు.

దరఖాస్తు చేసుకున్న వారు సెప్టెంబర్ 2వ తేదీ సోమవారం తన ఒరిజినల్ సర్టిఫికెట్లతో కళాశాలలో జరిగే ఇంటర్వ్యూకు హాజరు కావాలన్నారు.

సాంకేతిక పరిజ్ఞానంతోనే ఆహార స్వయం సమృద్ధి

నగరి: వ్యవసాయ రంగంలో వచ్చిన శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానంతోనే ఆహార స్వయం సమృద్ధి సాధ్యమవుతోందని నగరి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డా.వేణుగోపాల్ అన్నారు. గురువారం కళాశాలలో సెట్విన్, కళాశాల సిబ్బంది సంయుక్తంగా నిర్వహించిన జాతీయ యువజనోత్సవాలు–2025 కార్యక్రమానికి ఆయన అధ్యక్షత వహించారు. ఆయన మాట్లాడుతూ సాంకేతిక పరిజ్ఞానంతోనే ఆహార ఉత్పత్తులు ఎక్కువగా చేయడానికి వీలుపడుతోందన్నారు. సెట్విన్ ముఖ్య కార్యనిర్వహణాధికారి డాక్టర్ మురళీకృష్ణ మాట్లాడుతూ వివిధ శాస్త్రవేత్తలు ఆయా కాలాల్లో చేసిన నవకల్పనల గురించి వివరించారు. కార్యక్రమ సమన్వయ కర్త డా.రమేష్ మాట్లాడుతూ జీవసాంకేతిక రంగంలో జీన్ ఎడిటింగ్(జన్యు సవరణ) పునరుత్పాదక శక్తి వనరులు, సుస్థిర అభివృద్ధి కోసం సౌర, పవన శక్తి పర్యావరణ పరిరక్షణలో తెస్తున్న మార్పులను, పర్యావరణ సమతుల్యతలో వాటి ఆవశ్యకతను వివరించారు. సెట్విన్ మేనేజర్ కె. మోహన్‌కుమార్, డాక్టర్ సుహాసిని, డాక్టర్ స్వాతి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సెట్విన్ సీఈఓ

బూచివానత్తంలో ఆటల పోటీలు



బహుమతులు అందిస్తున్న పంచాయతీ కార్యదర్శి

విజయపురం: మండలంలో బూచివానత్తం సచివాలయం పరిధిలో జాతీయ క్రీడా దినోత్సవం గురువారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించి, గెలుపొందిన విద్యార్థులకు పంచాయతీ కార్యదర్శి సంపూర్ణ బహుమతులు ప్రదానం చేశారు. ప్రతిఒక్కరూ చదువుతో పాటు, క్రీడల్లో కూడా రాణించాలన్నారు.

జ్వరంతో వచ్చి మహిళ మృతి



కవిత మృతదేహం వద్ద రోదిస్తున్న బంధువులు

చిత్తూరు రూరల్(కాణిపాకం): జ్వరంతో వచ్చిన మహిళ డాక్టర్ల నిర్లక్ష్యంతో మృతి చెందిందని బాధిత కుటుంబీకులు రోదించారు. గంగాధర నెల్లూరు మండలం ఆత్మకూరుకు చెందిన కవిత(36) గురువారం తీవ్ర అస్వస్థతకు గురైంది. కుటుంబీకులు ఆమెను చిత్తూరు జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకువచ్చారు. గంట సమయానికి ఆమె ఊపిరాడక చనిపోయింది. వైద్యుల నిర్లక్ష్యం వల్లే కవిత మృతి చెందిందని ఆరోపిస్తూ కుటుంబీకులు అత్యవసర విభాగం ఎదుట మృతదేహాన్ని ఉంచి నిరసన చేపట్టారు. స్థానిక ఎమ్మెల్యే సంబంధిత వ్యక్తులు అక్కడికి చేరుకుని ఆస్పత్రి సిబ్బంది, వైద్యులపై ప్రశ్నల వర్షం కురిపించారు. వైద్యులు దీనిపై వివరణ ఇస్తూ తక్షణం ప్రాథమిక చికిత్స అందించామని, ఊపిరితిత్తుల సమస్య కారణంగా ఆమె చనిపోయినట్లు తెలిపారు.

నగరి మున్సిపల్ సమావేశం రేపు

నగరి: మున్సిపల్ సాధారణ సమావేశం మున్సిపల్ చైర్మన్ పీజీ నీలమేఘం అధ్యక్షతన శనివారం ఉదయం 11 గంటలకు మున్సిపల్ కౌన్సిల్ హాల్‌లో నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ మంజునాథ్ గౌడ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

నాగాలమ్మకు ప్రత్యేక పూజలు

–పూజల్లో మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి

పాలసముద్రం: మండలంలోని క్రిష్ణజమ్మపురం ద్రౌపదమ్మ దేవాలయ సమీపంలో నూతనంగా ప్రతిష్ఠించిన నాగాలమ్మకు గురువారం వివిధ అభిషేకాలు, ప్రత్యేక పూజలు జరిగాయి. నాగాలమ్మ విగ్రహం ప్రతిష్ఠ ఉభయదారులు మునస్వామినాయుడు కుటుంబసభ్యులు అమ్మవారి పూజలకు కావలసిన పూజాసామగ్రిని గ్రామాల్లో ఊరేగించి అమ్మవారికి సమర్పించారు. వేదపండితులు ప్రత్యేక పూజలు చేశారు. నాగాలమ్మ విగ్రహా ప్రతిష్ఠ పూజా కార్యక్రమంలో మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి పాల్గొన్నారు.



నాగాలమ్మ సేవలో మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి

ఆయనకు పార్టీ రుణపడి ఉంటుంది

కార్వేటినగరం: వైఎస్సార్‌సీపీ ఆవిర్భావం నుంచి పార్టీ అభివృద్ధికి మారుసాని కుటుంబసభ్యులు ఎంతో కృషిచేశారని, రామచంద్రారెడ్డి(65) అనారోగ్యంతో మృతిచెందడం పార్టీకి తీరనిలోటని రాష్ట్ర మాజీ డిప్యూటీ సీఎం కె.నారాయణస్వామి అన్నారు. ఆయన కుటుంబానికి పార్టీ ఎప్పుడూ రుణపడి ఉంటుందన్నారు. మండలంలోని ఆర్కే వీబీ పేట గ్రామానికి చెందిన మాజీ జెడ్పీటీసీ లోకనాథరెడ్డి సోదరుడు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు రామచంద్రారెడ్డి కర్మక్రియలకు గురువారం నారాయణస్వామి హాజరయ్యారు. రామచంద్రారెడ్డి చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబాన్ని ఓదార్చారు. మాజీ మండల కన్వీనర్ ధనంజయవర్మ నివాళులర్పించారు.

కుష్ఠు వ్యాధికి ఉచిత శస్త్రచికిత్స



మాట్లాడుతున్న డెమో ఆఫీసర్ కిరణ్‌కుమార్

పుత్తూరు: కుష్ఠు వ్యాధి నిర్ధారణ అయితే ఉచిత శస్త్రచికిత్సతో పాటు మందులు ఉచితంగా అందిస్తామని జిల్లా కుష్ఠు, క్షయ డిప్యూటీ డెమో ఆఫీసర్ కిరణ్‌కుమార్ తెలిపారు. గురువారం పరమేశ్వర మంగళం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో గ్రామంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో కుష్ఠు, డయేరియా, సీజనల్ వ్యాధులతాయన అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ శరీరంపై స్పర్శలేని మచ్చలు, నొప్పితో కూడిన నరాలు, నొప్పిలేని పుండ్లు, ముఖంపై నూనె రాసినట్లు జిడ్డుగా నిగనిగలాడే చర్మం వంటి లక్షణాలు ఉన్నట్లయితే కుష్ఠు వ్యాధిగా అనుమానించి దగ్గరలోని ప్రభుత్వ ఆస్పత్రిలో డాక్టర్లను సంప్రదించాలని ఆయన సూచించారు. కుష్ఠు వ్యాధిగ్రస్తులకు ఉచితంగా ఎంసీఆర్ చెప్పులు పంపిణీ చేస్తామని తెలిపారు. అలాగే సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఆయన తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎం చంద్రశేఖర్‌శెట్టి, పీహెచ్‌సీ సిబ్బంది రమేష్, విజయకుమారి, లలిత, జయలక్ష్మి, విద్యార్థులు పాల్గొన్నారు.